ఏజెన్సీలో పాఠశాలల విలీనం వద్దు

- జిఒ 117 అమలు నుంచి మినహాయింపునివ్వాలి

ప్రజాశక్తి -పాడేరు: జిఒ 117 ప్రకారం తక్కువ విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలను సమీప హైస్కూళ్ళలో విలీనం చేసే ప్రక్రియ నుంచి ఏజెన్సీ పాఠశాలలకు మినహాయింపు నివ్వాలని అల్లూరి జిల్లా ఆదివాసి మాతృభాష ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చిట్టిబాబు శ్రీను ప్రభుత్వాన్ని కోరారు మంగళవారం పాడేరులో సంఘం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో జిఒ 117 ప్రకారంగా ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనం చేస్తూ సుమారు 350 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు మూతబడక తప్పదన్నారు. మారుమూల గిరిజన గ్రామాల విద్యార్థులకు చదువు దూరమైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిబాలల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పాఠశాలల విలీన ప్రక్రియను మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు ఎస్.సతీష్, కుమారి, కె. వీరయ్య, పి. బొంజుబాబు పాల్గొన్నారు.

సమస్యలపై గళమెత్తుతా..

అవకాశమివ్వండి

- విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తా
- మండలి ఎన్నికల్లో రాజకీయ జోక్యం భావ్యంకాదు
- విద్యారంగాన్ని దెబ్బతీసే పార్టీలు బలపరిచే అభ్యర్థుల వల్ల సమస్యలు పరిష్కారంకావు
- పిడిఎఫ్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న విజయగౌరి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 27న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే మండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తుతానని యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. మంగళవారం విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ శాసనమండలి అంటే పెద్దల సభని, అటువంటి సభలో పిడిఎఫ్ తరఫున గెలుపొంది ఎమ్మెల్సీలుగా పనిచేస్తున్న అభ్యర్థులు ఎంతో హుందాతనంగా, రాజకీయాలకు అతీతంగా.. ఉపాధ్యాయుల, ఉద్యోగుల, పెన్షనర్ల, కార్మికుల సమస్యలపై పోరాటాలు చేస్తున్నారని చెప్పారు. పిడిఎఫ్ గత ఎమ్మెల్సీలూ ప్రజా గొంతుకగా నిలిచారన్నారు. శాసనమండలి ఉద్దేశాన్ని, హోదాను, ఉన్నతిని కాపాడి నిజాయితీగా ఉపాధ్యాయుల సమస్యలపై ప్రతిరోజూ పోరాటం చేస్తున్న పిడిఎఫ్ తరుపున తాను పోటీ చేస్తున్నానని చెప్పారు. విద్యా రంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సమస్యలపై తాను పోరాటం చేస్తానన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన జిఒ 117 వల్ల అనేక పాఠశాలలు మూతపడ్డాయని తెలిపారు. 3, 4, 5 తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయడం వల్ల గ్రామీణ ప్రాంతంలో పాఠశాలలు మూత పడ్డాయని, తాము అధికారంలోకి వస్తే ఆ జిఒను రద్దు చేస్తామని గెలిచిన టిడిపి కూటమి ఆ తరువాత ఆ మాటను మరిచిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక పాఠశాలల ఉనికి లేకుండా సన్నాహాలు చేస్తోందని తెలిపారు. అదే జరిగితే మరిన్ని పాఠశాలలు మూతపడటం, ఉపాధ్యాయుల పోస్టులు లేకుండా పోవడం తథ్యమన్నారు. దీంతో ప్రభుత్వ విద్య అందని ద్రాక్ష అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్సీగా నెగ్గితే జిఒ 117 రద్దుకు పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. పవిత్రమైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను కొన్ని రాజకీయ పార్టీలు కలుషితం చేశాయని, రాజకీయ పార్టీలు జోక్యం ఈ ఎన్నికల్లో ఉండటం భావ్యం కాదని అన్నారు. తాను ఎన్నో మహిళా ఉద్యమాలలో పాల్గొని, ప్రజా సేవా కార్యక్రమాలు చేశానని తెలిపారు. మండలి ఎన్నికల్లో గెలిస్తే రాజకీయాలకు, అవినీతికి తావులేకుండా నిజాయితీగా సేవ చేస్తానని, పిఆర్‌సి, ఇతర సమస్యలపై శాసన మండలిలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. సుదీర్ఘకాలం ఉపాధ్యాయుల సమస్యలపై పనిచేసి పరిష్కారం దిశగా కృషి చేసిన అనుభవం తనకు ఉందన్నారు. ఆరేళ్ల కాల ఉపాధ్యాయ వృత్తిని వదులుకొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకు వచ్చానన్నారు. విద్యారంగాన్ని దెబ్బతీసే పార్టీలు బలపరిచే అభ్యర్థుల వల్ల సమస్యలు పరిష్కారం కావన్నారు. బ్యాలెట్ పేపర్‌లో 1వ నెంబర్‌లో ఉన్న తనకు ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.లక్ష్మీరాజా, విశాఖ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు, కార్యదర్శి అంబేద్కర్, ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సుధాకరరావు పాల్గొన్నారు.

విజయగౌరి గెలుపునకు విస్తృత ప్రచారం

పెదబయలులో ప్రచారంలో సురేంద్ర, తదితరులు

ప్రజాశక్తి- పెదబయలు : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పిడిఎఫ్ తరపున పోటీలో ఉన్న కోరెడ్ల విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరుతూ మంగళవారం ఆదివాసీ గిరిజనసంఘం, సిఐటియు, యుటిఎఫ్, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విస్తృతంగాప్రచారం నిర్వహించారు. మండలంలోని సీకరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రచారంలో ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు గత కొన్నేళ్లుగా నిజాయితీ, నిబద్ధతతో విద్యారంగ పరిరక్షణ, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పోరాటాలకు సంఘీభావం తెలపడంతోపాటు ప్రత్యక్షంగా పాల్గొని ఉద్యమించిన ఘనచరిత్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు ఉందన్నారు. విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేసి, ఉద్యోగ, ఉపాధ్యాయులపై నిర్బంధం కొనసాగించిన గత ప్రభుత్వ విధానాలపై పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పోరాటం సాగించారన్నారు. ప్రభుత్వం మారితే ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని భావించినా, కూటమి ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. దీనిపై పోరాటానికి ప్రస్తుతమున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు మద్దతుగా ఉత్తరాంధ్ర నుంచి పోటీలో ఉన్న ఏకైక మహిళా అభ్యర్థి విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు బొండా సన్నిబాబు, జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్, మండల అధ్యక్షులు బొండా గంగాధరం, జిల్లా కమిటీ సభ్యులు జంపరంగి సునీల్ కుమార్ పాల్గొన్నారు

ముంచింగిపుట్టు : ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొర్ర త్రినాధ్ ఆధ్వర్యంలో మండలంలోని మంగళవారం లక్ష్మీపురం, కిలగడ కెజిబివి, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రచారం చేశారు. ఉపాధ్యాయ ఓటర్లను కలిసి, మొదటి ప్రాధాన్యత ఓటు విజయగౌరికి వేసి గెలిపించాలని కోరారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ రఘువర్మ ప్రస్తుతం కూటమి ప్రభుత్వ మద్దతుతో పోటీలో ఉన్నారని, ఆయనను గెలిపిస్తే, ప్రభుత్వానికి మద్దతుగా ఉంటారే, విద్య, ఉపాధ్యాయ సమస్యలపై ప్రశ్నించే పరిస్థితి ఉండదని వివరించారు. పోరాట చరిత్ర కలిగిన యుటిఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో పోటీలో ఉన్న పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి గెలుపు అవసరాన్ని గుర్తించి విజ్ఞతతో ఓటేయాలని అభ్యర్థించారు.

ముంచంగిపుట్టులో ప్రచారంలో ప్రజాసంఘాల నేతలు

ఎమ్మెల్సీ ఎన్నికలకు రేపే పోలింగ్

- ఎన్నికల సజావుగా నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- పోలింగ్ కేంద్రాల్లో 144 సెక్షన్ అమలు
- జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ వెల్లడి

జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు : జిల్లాలో ఉభయగోదారి, ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఐతే 4గంటలకు క్యూలైన్లలో ఉన్నవారికి స్లిప్పులు ఇచ్చి వారిని ఓటింగ్‌కు అనుమతిస్తామన్నారు. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలో పది మంది, ఉభయగోదారి పట్టభద్రుల ఎన్నికల బరిలో 35 మంది పోటీలో ఉన్నారన్నారు. మైక్రో అబ్జర్వర్లను నియమించామని, వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాటుచేసి, జిల్లా కేంద్రం నుంచి పర్యవేక్షిస్తామన్నారు.

జిల్లాలో ఉపాధ్యాయ నియోజక వర్గంలో 920 పురుష ఓటర్లు, 568 మంది మహిళా ఓటర్లు కలిపి 1488 మంది ఓటర్లుగా నమోదయ్యారని, వారు ఓటింగ్‌లో పాల్గొనేందుకు 11 మండల కేంద్రాల్లో పోలింగ్ బూత్ ఏర్పాటు చేశామన్నారు. పాడేరు డివిజన్‌ను నాలుగు జోన్లుగా విభజించి నలుగురు జిల్లా స్థాయి అధికారులను సెక్టోరల్ అధికారులను, 11 మండలాలకు 11 మంది రూట్ అధికారులను నియమించామన్నారు. రిజర్వ్ సిబ్బందితో కలిపి పోలింగ్, సహాయ పోలింగ్, ఇతర పోలింగ్ అధికారులను 64 మందిని కేటాయించామన్నారు. 9రిజర్వ్‌తో కలిపి 27 బ్యాలెట్‌బాక్స్‌లు సిద్ధం చేశామన్నారు.

అలాగే ఉభయగోదారి పట్టభద్రుల నియోజకవర్గంలో 2842 పురుష ఓటర్లు, 1827మంది మహిళా ఓటర్లు కలిపి 4669 మంది ఓటర్లుగా నమోదయ్యారన్నారు. 11 మండల కేంద్రాలతోపాటు అదనంగా వై రామవరం మండలం డొంకరాయిలో ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటుచేశామన్నారు.

రంపచోడవరం డివిజన్‌ను ఐదు జోన్లుగా, చింతూరు డివిజన్‌ను రెండు జోన్లుగా విభజించి జోనల్, రూట్ అధికారులను నియమించామని, రిజర్వ్ సిబ్బందితో కలిపి పోలింగ్, సహాయ పోలింగ్, ఇతర పోలింగ్ అధికారులను 72 మందిని కేటాయించామన్నారు.

జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంద మంగళవారం సాయంత్రం 4గంటల నుండి 27సాయంత్రం 6గంటల వరకు ఎటువంటి ర్యాలీలు, ప్రచారాలకు అనుమతులు లేవన్నారు. మద్యం షాపులు మూసేశామన్నారు.

పాడేరు డివిజన్‌లో తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలను ఎన్నికల సామగ్రి పంపిణీకి, పోలింగ్ అనంతరం ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్స్‌లు తీసుకొనుటకు, తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌గా ఏర్పాటు చేశామన్నారు. చింతూరు, రంపచోడవరం డివిజన్లలో ఆయా సబ్‌కలెక్టర్ కార్యాలయాలు పంపిణీ కేంద్రాలుగాను, రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని రిసెప్షన్, తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌గా ఏర్పాటు చేశామన్నారు.

మరో మూడు రోజుల్లో ఇంటర్ పరీక్షలు

- ఏర్పాట్లలో అధికారుల నిమగ్నం
- జిల్లాలో 26 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- 76 జూనియర్ కాలేజీలకు చెందిన 14,720 విద్యార్థుల హాజరు
- మార్చి 1 నుంచి పరీక్షలు ఆరంభం

ప్రజాశక్తి- పాడేరు టౌన్: ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు మరో మూడు రోజుల్లో మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లలో అధికారులు నిమగ్న మయ్యారు. ఇప్పటికే ప్రశ్నాపత్రాలు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. వాటిని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. సమాధాన పత్రాలను పరీక్ష కేంద్రాలకు పంపించారు.

అల్లూరి జిల్లాలో ఇంటర్ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించడానికి అధికార యంత్రాంగం అన్ని చర్యలు చేపడుతోంది. పోలీసుల ప్రత్యక్ష భద్రతతోపాటు. సిసి కెమెరాల నిఘాలో పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 17 ఎపిటిడబ్ల్యూఆర్, 19 కెజిబివి, 5 హెచ్ఎస్ ప్లస్, 16 ప్రైవేట్ కాలేజీలతో కలుపుకుని మొత్తం 76 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. 8,063 మంది ఫస్టియర్, 6,657 మంది సెకెండియర్, మొత్తంగా 14,720 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. జిల్లావ్యాప్తంగా 26 కేంద్రాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు కేంద్రాలకు సకాలంలో చేరుకోవడానికి ఆర్‌టిసి బస్సులు ఏర్పాటు చేశారు. ప్రశ్నాపత్రాలు, మెటీరియల్‌ను బాక్సుల్లో సబ్జెక్టుల వారీగా పోలీస్ స్టేషన్ల నుంచి పోలీసు బందోబస్తు నడుమ వాహనాల్లో పరీక్ష కేంద్రాలకు అధికారులు తరలించి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులు అరగంట ముందుగా 8.30 గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. 9 గంటల తర్వాత ఎవరినీ పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరు. కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. విద్యార్థులను 12 గంటల తర్వాత మాత్రమే బయటకు పంపిస్తారు.

భవిష్యత్‌కు కీలకం ఇంటర్ పరీక్షలు

పదో తరగతి పరీక్షలు ఎంత కీలకమైనవో, ఇంటర్ పరీక్షలు కూడా అంతే ప్రధానమైనవి. ఇంటర్ తరువాతనే విద్యార్థుల భవిష్యత్‌కు పునాది వేసుకునేందుకు ఏ కోర్సులు ఎంచుకోవాలో విద్యార్థులకు ఒక అంచనా, అవగాహన రానుంది. ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి మార్కులతో పాసై, జెఇఇ, ఎపిసెట్, నీట్ తదితర ఉమ్మడి ప్రవేశ పరీక్షల్లో ర్యాంకులు దక్కించుకుంటేనే ఉన్నత విద్యాభ్యాసానికి మార్గం సుగమమవుతుంది.డిగ్రీ లేదా ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సుల్లో ఎటు వెళ్లాలో ఇంటర్ తర్వాత నిర్ధారణకు రానున్నారు.

తాళం వేసి ఉన్న గ్రామ సచివాలయం వద్ద ఎంపిడిఒ శ్రీనివాస విశ్వనాథ్

జిఎం.వలస పంచాయతీ కార్యదర్శి

కృష్ణప్రసాద్ విధులకు గైర్హాజరు

- ఉన్నతాధికారులకు నివేదిస్తామన్న ఎంపిడిఒ

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండలంలోని జియం.వలస పంచాయతీ కార్యదర్శి వనిమిశెట్టి కృష్ణప్రసాద్ పంచాయితీ కార్యదర్శుల సమీక్షా సమావేశానికి హాజరు కాకపోవడం, ఆయనపై గ్రామస్థాయి నుండి పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో మంగళవారం ఎంపిడిఒ తూతిక శ్రీనివాస విశ్వనాధ్ గ్రామాన్ని సందర్శించారు. అయితే పంచాయతీ కార్యదర్శి కృష్ణప్రసాద్ విధులకు గైర్హాజరయ్యారు. ఎంపిడిఒ చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించగా, తాళం వేసి ఉంది. పంచాయతీ కార్యదర్శి విధులకు గైర్హాజరైనట్లు గుర్తించిన ఎంపిడిఒ అక్కడ ఉన్న సచివాలయ సిబ్బందిని విచారించారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణ ప్రసాద్ విధులకు తరచూ గైర్హాజరు కావడం వలన గిరిజనుల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటున్నామని సచివాలయం సిబ్బంది తెలిపారు. తమకు జీతాలు ఇవ్వడంలో కూడా అలసత్వం వహించడం వలన ఇబ్బంది పడుతున్నామని ఎంపీడీఓకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాధ్ మాట్లాడుతూ పూర్తి వివరాలతో జిల్లా కలెక్టర్‌కు, రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారికి, జిల్లా పంచాయతీ అధికారికి నివేదిక సమర్పిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కుండాడ సర్పంచ్ కూండ్ల ప్రభాకర్ రెడ్డి, పంచాయతీ విస్తరణాధికారి పెయ్యల విజయ, సచివాలయం సిబ్బంది సురేష్, విశ్వనాధ్, శ్వేత, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శి ఏకపక్ష నిర్ణయాలతో ఇబ్బందులు : సర్పంచ్ కారం లక్ష్మి

ప్రభుత్వ లక్ష్యాలకు తూట్లు పొడుస్తూ, గిరిజనుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న జియం.వలస పంచాయతీ కార్యదర్శి వనిమిశెట్టి కృష్ణప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ పంచాయతీ సర్పంచ్ కారం లక్ష్మి విజ్ఞప్తి చేశారు. సర్పంచుగా ఉన్న తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కార్యదర్శి ఏకపక్ష నిర్ణయాలతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ ఆదేశాలు మేరకు ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్త సేకరించి చెత్త నుండి సంపద కేంద్రానికి తరలించి గ్రామాన్ని సంపూర్ణ పారిశుధ్య గ్రామంగా తీర్చిదిద్దడానికి సహకరించమని ఎన్ని సార్లు చెప్పినా, ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ పంచాయతీకి తీరని నష్టం చేస్తున్నారని ఆరోపించారు. కార్యదర్శి విధులకు సక్రమంగా హాజరు కాకపోవడం వలన ఆయన సంతకాల కోసం వస్తున్న ప్రజలు సేవలు అందక నిరాశతో వెనుదిరగాల్సి వస్తోందని పేర్కొన్నారు. దీనిపై గతంలో అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఆరోపించారు. పంచాయతీ నిధులు పాలకవర్గానికి చెప్పకుండా ఖర్చు చేస్తున్నారని, దీనిపై విచారించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో బొడ్డగండి గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగంపై కృష్ణప్రసాద్ సస్పెండ్ అయినా తన పంథా మార్చుకోలేదని పేర్కొన్నారు.

ప్రశ్నించే గొంతు పిడిఎఫ్ అభ్యర్థికే మద్దతు

వైసిపి మండల అధ్యక్షులు తానికొండ వాసు

ప్రజాశక్తి-ఎటపాక

ఉభయ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైసీపీ పోటీలో లేనందున, సమస్యలపై నిరంతరం ప్రశ్నించే పిడిఎఫ్ తరపున పోటీలో ఉన్న డివి రాఘవులుకే తాము మద్దతు తెలుపుతున్నట్టు వైసీపీ మండల అధ్యక్షుడు తానికొండ వాసు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం ఆయన వైసిపి నాయకులతో కలిసి మాట్లాడారు. వైసిపి శ్రేణులు, అభిమాన పట్టభద్రులు పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డివి రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి, ఎన్నికలలో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోడానికి కూటమి ప్రభుత్వానికి సంపూర్ణ మెజారిటీ ఉందని, ఇప్పటి వరకు ఆ దిశగా ప్రయత్నాలు చేయకుండా, మళ్లీ ఎమ్మెల్సీ ఎన్నికలకు మెగా డీఎస్సీ ముడి పెట్టడం నిరుద్యోగులను మరోసారి మోసం చేయడమే అవుతుందని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి 164 మంది ఎమ్మెల్యేలు గెలిచినా సాధ్యపడడం లేదా అని ప్రశ్నించారు. నిజాయితీ, నిబద్ధతతో ప్రభుత్వ లోపాలను ఎత్తి చూపి, ప్రజా సమస్యలు మండలిలో లేవనెత్తి వాటి పరిష్కారం కొరకు పాటుపడే పిడిఎఫ్ అభ్యర్థి డివి రాఘవులుకు పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత, ఎంపీపీ కాకా కామేశ్వరి, రాష్ట్ర కార్యదర్శి మంత్రిప్రగడ నరసింహారావు, జెసిఎస్ ఇంచార్జి గోసు ప్రశాంత్, లక్ష్మణరావు, రాంబాల నాగేశ్వరరావు, కొవ్వూరి రాంబాబు, శివబాబు, కృష్ణబాబు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి మండల అధ్యక్షులు తానికొండ వాసు, ఆ పార్టీ నాయకులు

దిడ్ల వీర రాఘవులుకు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలి

మండలంలో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-విఆర్.పురం

ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ మధ్య తరగతి, నిరుద్యోగ యువత కష్టాలు పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు మాత్రమే తెలుసన్నారు. ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు ఎల్లవేళలా అండగా నిలబడింది పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని, పై వర్గాల సమస్యలు పరిష్కారం కావాలంటే పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈనెల 27న జరుగు ఎన్నికల్లో తొలి పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పోడియం శ్రీరామ్మూర్తి, తుర్రం బాబురావు, కమ్మచిచ్చు సత్యనారాయణ, అజరత్, నల్లారపు ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు కరపత్రాలు ఇచ్చి ప్రచారం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

స్విచ్ యార్డులో మరమ్మతులు చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

జల విద్యుత్ కేంద్రం స్విచ్ యార్డులో మంటలు

- మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-సీలేరు

సీలేరు జల విద్యుత్ కేంద్రంలోని స్విచ్ యార్డులో మంగళవారం ఉదయం పెద్ద ఎత్తున శబ్దాలతో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో జల విద్యుత్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తమై స్విచ్ యార్డులో విద్యుత్తు లైన్లను ట్రిప్ చేశారు. ఇంజినీర్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్విచ్ యార్డు నుండి విద్యుత్తు వెళ్లే డొంకరాయి ఫీడర్‌కు చెందిన 220 కేవీ విద్యుత్తు లైన్లలో పైఫేజ్‌కు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ జంపర్ తెగిపోయి పెద్ద ఎత్తున మంటలు చెలరేగినట్లు గుర్తించారు. వెనువెంటనే మరమ్మతులు చేపట్టి మధ్యాహ్నం 3.30 గంటలకు పూర్తిచేసి డొంకరాయి ఫీడర్ నుంచి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. డొంకరాయి ఫీడర్లో తలెత్తిన సాంకేతిక సమస్య వల్ల రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అంతరాయం ఏర్పడింది. దీనిపై ఏపీ జెన్కో ఈఈ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ డొంకరాయి ఫీడర్‌లోని జంపర్ తెగిపోవడం వల్ల మంటలు వ్యాప్తిచెందాయని, సిబ్బంది స్పందించి మరమ్మతులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువచ్చారని తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-రంపచోడవరం : వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ఉండాలంటే ప్రజలు అగ్ని ప్రమాదాలపై ముందస్తుగా అవగాహన కలిగి ఉండాలని రంపచోడవరం అగ్నిమాపక అధికారి ఎస్ గంగన్నదొర అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గడిచిన సంవత్సరకాలంలో సుమారు 30 అగ్ని ప్రమాదాలు సంభవించగా, సుమారు రూ.30 లక్షల విలువ చేసే ఆస్తిని కాపాడడం జరిగిందని, రూ.9 లక్షల విలువైన ఆస్తులను నష్టపోవడం జరిగిందని తెలిపారు. ఈ ఏడాది వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. సినిమా హాలు, షాపింగ్ మాల్స్, పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు తదితర ప్రదేశాలలో ఫైర్ ఎక్విప్‌మెంట్‌ను కండిషన్లో ఉంచుకోవాలని సూచించారు. గృహాల్లో వంట పూర్తి చేసిన అనంతరం పొయ్యిలను పూర్తిగా ఆర్పాలని, గ్యాస్ పొయ్యిలు అయితే సిలిండర్ వద్ద ఆఫ్ చేసుకోవాలని కోరారు. ఎక్కడైనా అగ్నిప్రమాదాలు సంభవిస్తే వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం తెలియజేస్తే తాము అగ్ని ప్రమాదాన్ని నివారింపజేయడానికి కృషి చేస్తామని తెలిపారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే 08864 243899, లేదా 101 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎస్ఎస్ఎ ఎపిసి

నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంపై అసంతృప్తి

ప్రజాశక్తి - ముంచింగిపుట్టు: మండలంలోని కిలగాడ కస్తూర్బా పాఠశాలను సర్వశిక్ష అభియాన్ ఎపిఒ డాక్టర్ స్వామినాయుడు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మన బడి - మన భవిష్యత్తులో భాగంగా అదనపు తరగతి గదుల నిర్మాణాలు నత్తనడకన సాగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ భవన నిర్మాణాలను చేపట్టాలన్నారు. పునాదుల స్థాయి దాటని నిర్మాణ పనులపై ప్రిన్సిపల్ సాయిప్రసన్నను వివరణ కోరగా, సరైన సమాధానం రాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. భవన నిర్మాణాలను వేగవంతం చేయడానికి కమిటీని ఏర్పాటుచేసి, ఎస్ఎస్ఎ డిఇఇ ఆధ్వర్యంలో పనులు కొనసాగించాలని సూచించారు. గతంలో వైసిపి ప్రభుత్వహయాంలో మంజూరై, అర్ధాంతరంగా నిలిచిన నాడునేడు నిర్మాణ పనులను కూడా మనబడి మన భవిష్యత్తు కార్యక్రమంలో చేర్చి పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వంటశాలలో పనులను పరిశీలించారు. పిల్లలతో కలిసి మధ్యాహ్నభోజనం రుచిచూశారు. పర్యటనలోటి అడాప్టెడ్ లెర్నింగ్ అమలు తీరును పరిశీలించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సాయి ప్రసన్న, పాత్రుడు పాల్గొన్నారు.

శైవక్షేత్రాల్లో మహాశివరాత్రి సందడి

ప్రజాశక్తి -పాడేరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పట్టణంలోని శివాలయాల్లో సందడి నెలకొంది. ఆలయ ప్రాంగణాలను ప్రత్యేక అలంకరణలతో ముస్తాబు చేశారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని ప్రధాన శివాలయం శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి సన్నిధి రాజరాజేశ్వరి ఆలయంలో శివరాత్రి జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తయ్యాయి.. సోమవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఉమా నీలకంఠేశ్వర స్వామికి మోదకొండమ్మ ఆలయం నుంచి పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో శివపార్వతుల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. పాడేరు పట్టణ వీధుల్లో మంగళవారం సాయంత్రం శివపార్వతుల పల్లకి సేవ నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం ఉదయం ఆలయాల్లోప్రత్యేక పూజలు, భక్తుల దర్శనాలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తిచేశారు.ఉమా నీలకంఠేశ్వర ఆలయ ప్రాంగణంలో బుధవారం మధ్యాహ్నం మహా అన్నసమారాధన జరగనుంది. శివరాత్రి జాగరణ లో భాగంగా బుధవారం రాత్రి ఆలయం వద్ద రుద్రాభిషేకం నిర్వహించనున్నారు.

ఉన్నత విద్యావకాశాలపై అవగాహన

ప్రజాశక్తి-అరకులోయ: స్థానిక ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలపైకళాశాల ప్రిన్సిపల్ పి.చలపతిరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.కార్యక్రమంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కాకినాడ క్యాంపస్ రాజనీతిశాస్త్రం విభాగాధిపతి డాక్టర్ కె.జోసెఫ్ స్టీఫెన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.గోపి (పొలిటికల్ సైన్స్), వి శ్రీనివాసరావు (ఎకనామిక్స్) ముఖ్య అతిథులుగా పాల్గొని,డిగ్రీ తర్వాత పీజీ, ఇతర కోర్సులలో చేరుటకు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించుటకు ఒక నిర్దిష్ట ప్రణాళికను ఇప్పటినుంచే ఎలా అలవర్చుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. తమకు నచ్చిన రంగంలోకి చేరాలంటే విద్యార్థులు చదువుపై ఆసక్తిని పెంచుకుని,పట్టుదలతో శ్రమించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ పి. చలపతిరావు మాట్లాడుతూ, విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతమైన స్థానాలలో చేరాలంటే క్రమశిక్షణ, నైతిక విలువలతో విద్యాభ్యాసం చేయాలని, లక్ష్యంపై ఏకాగ్రత ఉండాలన్నారు.కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు సీనియర్ అధ్యాపకులు కె.ధర్మారావు (పొలిటికల్ సైన్స్), కె.బాలరాజు (కామర్స్) డాక్టర్ సుభాన్ , డాక్టర్ బలరాం, డాక్టర్ స్వప్నత, డాక్టర్ లక్ష్మి, పి దివ్య, మౌనిక, డికెవిఎన్. ప్రణీత్ వి. సరస్వతి, కె.రమేష్ అధ్యాపకేతర సిబ్బంది గోపాలకృష్ణ సుందరరావు, చంటి, రిచా, సంగీత పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఇ సర్వే వేగవంతం చేయండి

జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- పాడేరు : జిల్లాలో సూక్ష్మ, చిన్న తరహా సంస్థల సర్వే వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. జిల్లాలో 11279 సూక్ష్మ చిన్న తరహా సంస్థలలో 4608 సంస్థలను సర్వే చేసారని, మిగిలిన 6671 సంస్థల సర్వే పూర్తి చేయాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుండి ఐటిడిఎ ఎఒలు, ఎంపిడిఒలు, ఉపాధి హామీ, పంచాయతీ, నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఆహార భద్రత, సహకార సంస్థ, పౌర సరఫరాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఇ సర్వే సక్రమంగా చేయని ఎంపిడిఒలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సిఇఒను ఆదేశించారు. మార్చి 8 నుండి 18 వరకు పబ్లిక్ ప్రైవేటు పీపుల్స్ పార్టనర్షిప్ (4పి) సర్వే జరుగుతుందన్నారు. పి4 సర్వేలో నిరుపేద కుటుంబాలను గుర్తించాలన్నారు. సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. సమయ పాలన పాటించని సచివాలయం సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒలను ఆదేశించారు. పంచాయితీలలో చెత్త సేకరణపై ఆరా తీసారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను వినియోగం లోకి తీసుకుని రావాలని సూచించారు. పిఎం ఇంటర్న్‌షిప్ ఎంత మందిని చేర్పించారని ఎంపిడిఒలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయం పరిధిలో ఉన్న విద్యావంతులైన నిరుద్యోగ అభ్యర్థులను నమోదు చేయాలని ఎంపిడిఒలకు సూచించారు. పిఎం ఇంటర్న్‌షిప్‌లో చేరిన అభ్యర్థులకు ప్రభుత్వం రూ.5 వేలు ఉపకార వేతనం అందిస్తుందన్నారు. అరకు వ్యాలీ,పాడేరు, చింతపల్లి డిగ్రీ కళాశాలల్లో ఇంటర్న్‌షిప్ శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.
సంకల్ప పథకంలో సెల్ఫ్ డిఫెన్స్‌లో బాలికలకు తర్ఫీదుఅందిస్తున్నామన్నారు. కౌమార దశ బాలికలకు నైపుణాభివృద్ధి శిక్షణ శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. ఎంపిడిఒలు స్కిల్ కో ఆర్డినేటర్లతో సమన్వయం చేయాలని సూచించారు. ఇప్పటి వరకు నమోదు చేసుకోని వికలాంగులు సమీపంలోని సచివాలయాలకు వెళ్లి నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో పర్చువల్‌గా పాడేరు ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ, రంపచోడవరం పిఒ కె. సింహచలం, గ్రామ అధికారి పిఎస్. కుమార్ హౌసింగ్ పిడి బి.బాబు, వార్డు సచివాలయం నోడల్ జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు, డ్వామా పిడి డాక్టర్ విద్యాసాగర్, జిల్లా పుడ్‌సేఫ్టీ అధికారి డి. వేణుగోపాలరావు, సిపిఒ ఎస్ఎస్ఆర్‌కె పట్నాయక్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.రోహిణి, జిల్లా కో ఆపరేటివ్ అధికారి ఎంవి.రామకృష్ణం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదులో అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు

జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు : ఆధార్ నమోదులో అధిక వసూళ్లకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. మీ సేవా కేంద్రాలు, నెట్ సెంటర్లలో నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినా, వాటి ఆధారంగా ఆధార్ నమోదు చేసినా తీవ్రమైన చర్యలు తీసుకుంటామన్నారు. మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఆధార్ పర్యవేక్షణ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ నెట్ సెంటర్లలో నకిలీ ఆధార్ కార్డుల జారీపై అధికారులు తనిఖీ చేసి కేసులు నమోదు చేయాలని సూచించారు. ఆధార్‌కార్డుల నవీనీకిరణతోపాటు ఐదేళ్ల లోపు పిల్లలందరికి ఆధార్ నమోదు చేయాలని ఆదేశించారు. ల్లా లో 1.33లక్షల మందికి ఆధార్ కార్డులు నమోదు చేయాల్సి ఉందని, 35 వేల మందికి జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలన్నారు. ఆధార్ కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాల జారీకి సచివాలయం డిజిటల్ అసిస్టెంట్లకు లక్ష్యాలు నిర్దేశించాలని సూచించారు. లక్ష్యాలు సాధించ లేని డిజిటల్ అసిస్టెంట్లను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఎంపిడిఒలు, తాహశీల్దారులు, నోడల్ అధికారులు, సబ్ కలెక్టర్లు నెలకు నాలుగు సచివాలయాను తనిఖీ చేయాలని సూచించారు. డిఇఒ, గిరిజన సంక్షేమశాఖ జిల్లా ఉప సంచాలకులు సమన్వయంతో పాఠశాలల విద్యార్థులకు ఆధార్ కార్డు నమోదు చేయించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు ఆధార్ నమోదు చేయించే బాధ్యత ఐసిడిఎస్ అధికారులపైనే ఉందన్నారు. ఆసుపత్రి ప్రసవాలు జరిగిన తరువాత , డిశ్చార్జిలోపే చిన్నారులకు జనన ధ్రువీకరణ పత్రాలు అందించాలని ఆదేశించారు. సచివాలయం, ఆసుపత్రుల్లో బర్త్ సర్టిపికెట్ల జారీ, గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ నమోదుపై సూచనలు చేశారు. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు తగిన శిక్షణ అందించాలని అధికారులకు సూచించారు.

ఉచితంగా కొత్త ఆధార్ నమోదు

కొత్తగా ఆధార్ నమోదు చేసుకునే వారికి ఉచితంగా నమోదు చేస్తారన్నారు. బయోమెట్రిక్ నవీకరణకు రూ.100, పేరు, చిరునామా, జెండర్, ఫోను నంబర్ల మార్పులకు రూ.50, డాక్యుమెంటు నవీనీకరణకు రూ.50 రుసుము చెల్లించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, గ్రామ వార్డు సచివాలయ నోడల్ అధికారి పి.ఎస్.కుమార్, భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ప్రాజెక్టు మేనేజర్ జావీద్, డిఆర్‌డిఎ పీడీ వి.మురళి, డిఇఒ పి. బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఎల్.రజని, ఇన్‌ఛార్జి డిఎల్‌ఒ. తేజ రతన్, పిఎంయు ప్రోగ్రాం అధికారి ఆర్.రాంగోపాల్, గ్రామ సచివాలయ జిల్లా కో ఆర్డినేటర్ సునీల్, మొబైల్ కోర్డినేటర్ నాగరాజు ప్రత్యక్షంగానూ, రంపచోడవం ఐటిడిఎ పిఒలు కె.సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పనాశ్రీ వర్చువల్‌గా పాల్గొన్నారు.

కాజ్‌వేను పునర్నిర్మించాలి

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ శీలంగొంది రోడ్డు చంపపటి గెడ్డపై కొట్టుకుపోయిన కాజ్‌వేను పునర్మిర్మించాలని ఆ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2014 హుదూద్ తుఫాన్ సమయంలో కొట్టుకుపోయిన ఈ కాజ్‌వేను ఇప్పటివరకు పునర్మిర్మించలేదని, దీనిపై అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, నిర్లక్ష్యం చేస్తున్నారే తప్ప, నిర్మాణ చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాజ్‌వే కొట్టుకుపోవడంతో ఈ మార్గంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని,, ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి, కాజ్‌వేను పునరుద్ధరించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

జూద శిబిరంపై దాడి

ప్రజాశక్తి -జి.మాడుగుల : మండలంలోని కె.కోడాపల్లి పంచాయతీ సంగం గ్రామ పరిసర ప్రాంతంలో చిత్తులాట శిబిరంపై స్థానిక ఎస్ఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఎనిమిది మందిని జూదగాళ్లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 19410 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ౧. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు., ఎవరైనా చిత్తులాట, పేకాట, కోడిపందేలంటూ జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు,

అన్నదానం చేస్తున్న దాతలు

అన్న సమారాధన

ప్రజాశక్తి-పాడేరు టౌన్: స్థానిక మోదకొండమ్మ ఆలయంలో మంగళవారం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. విశాఖ జిల్లా గాజువాక వడ్లపూడికి చెందిన కనకలక్ష్మి ఆర్థిక సహాయంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, పాత పాడేరు గ్రామపెద్ద కిల్లో మత్స్యరాజు నాయుడు ప్రారంభించారు. భవిష్యత్తులో భక్తులకు మరిన్ని సేవలను అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు, సభ్యులు దన్నేటి పలాసి రాము, బోనంగి వెంకటరమణ, కిల్లు రాధాకృష్ణ నాయుడు, రత్నబాయి, చంద్రమోహన్, కొమ్మాజి వెంకటరమణ, కూర రాము, పలాసి రమణమ్మ, ఆలయ కమిటీ సేవకులు కిల్లు శివకుమారి, రత్నకుమారి, చల్ల లింగమ్మ, అప్పలమ్మ, గూడెపు సూర్య ప్రకాష్ సత్యనారాయణ పాల్గొన్నారు.

మాతృభాషా వాలంటీరును నియమించరూ..

ప్రజాశక్తి- ముంచంగిపుట్టు : మండలంలోని కరిముఖిపుట్టు గ్రామపంచాయతీ సాంగుల గ్రామంలోపి ఎంపిపి పాఠశాలలో ఒరియా మాతృభాషా వాలంటీరును నియమించాలని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గల్లెల జీలబందు కోరారు. మంగళవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ఎంఇఒ కృష్ణారావుకు పాఠశాల కమిటీ తీర్మానంతోపాటు వినతిపత్రాన్ని అందజేశారు. సాంగుల పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 28 మంది విద్యార్థులున్న నేపథ్యంలో, ఉన్న ఒక్క ఉపాధ్యాయుడితో విద్యాబోధన సరిగా సాగడం లేదని, అంతేకాక ఇక్కడ చదువుతున్న ప్రాథమికస్థాయి విద్యార్థుల మాతృభాషలో బోధనకు వీలుగా ఒరియా భాషా వాలంటీరును నియమించాలని కోరారు. దీనిపై ఈ నెల 6న ఎంఇఒ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తే, విద్యాకమిటీ తీర్మానం చేసి తీసుకురావాలని సూచించారని, దానికి అనుగుణంగా పాఠశాల విద్యాకమిటీ సమావేశంపై తీర్మానించిన కాపీని ఎంఇఒకు అందజేశామన్నారు. ఒకటి, రెండు తరగతుల విద్యార్థుల విద్యాబోధన కుంటుపడకుండా తక్షణమే భాషా వాలంటీరు నియమకానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఆదివాసి గిరిజన సంఘం కమిటీ సభ్యులు గల్లెల పితాంబరం, గల్లెల పరుశురాం ఉన్నారు.

శివాలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -జి మాడుగుల: మండల కేంద్రంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో శివాలయ నిర్మాణానికి మంగళవారం ఆలయ ధర్మకర్త, భీమిలి సద్గురు సేవాశ్రమం నిర్వాహకులు సాయిరాం స్వామీజీ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. వచ్చేనెల 30న ఉగాది శివాలయ ప్రారంభోత్సవం, శివలింగం ప్రతిష్ట నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సాయిరాం స్వామీజీ మాట్లాడుతూ అల్లూరి జిల్లాతోపాటు సరిహద్దు ఒడిశాలో ఏ గ్రామంలోనైనా ఎటువంటి ఆలయాన్ని నిర్మించినా దేవతామూర్తుల విగ్రహాలను అందించడానికి తాను సిద్దంగా ఉన్నానని, స్థానిక పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద చిరునామా ఇచ్చి, సంప్రదించాలని కోరారు. ఇప్పటికే పలు ఆలయాలకు విగ్రహాలను సమకూర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యరాస మత్స్యరాజు, నాయుడు, అయ్యప్ప సేవా ట్రస్ట్ సభ్యులు ఆతవ శ్రీను, వడ్డాది శ్రీనివాసరావు, గొర్లి గణేష్, ఆలయ పూజారి పాల్గొన్నారు..

మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

జగన్ వ్యవహారం సరికాదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పుతో జగన్‌కు దిమ్మతిరిగిందని, ప్రజా తీర్పును స్వాగతించకుండా జగన్ వ్యవరిస్తున్న తీరు సరికాదని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను గాలికొదిలేసి ప్రతిపక్ష హోదా కోసం జగన్ ఆరాటపడుతున్నారన్నారు. 11 సీట్లు ఉన్న జగన్‌కు ప్రతిపక్ష హోదా అడిగే నైతిక హక్కు లేదన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రంగాలను భ్రష్టు పట్టించిందన్నారు. విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేసిందన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి పాల్గొన్నారు.

ఆగిన పెద్దేరు, రైవాడ జలాశయ పనులు

- పునరుద్ధరణకు ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : జిల్లాలోని సాగునీటి వనరుల అభివృద్ధికి కేటాయించిన నిధుల పనులు ముందుకు సాగడంలేదు. పెద్దేరు జలాశయ డిస్ట్రిబ్యూటరీ, రైవాడ జలాశయ డ్యామ్ పనులు కాలపరిమితిలో పూర్తికాలేదు. పెద్దేరు జలాశయ 1ఎల్ డిస్ట్రిబ్యూటరీలో 4ఎల్ (ఎ) పనుల కోసం గత ప్రభుత్వం 2023 జులై 13న రూ.9.12 కోట్లు మంజూరు చేసింది. శ్రీ సాయి లక్ష్మీ కనస్ట్రక్షన్స్ రూ.7.34 కోట్ల విలువైన పనులకు కాంట్రాక్ట్ దక్కించుకుంది. 2024 మార్చిలో పనులు అప్పగించినప్పటికీ 0.7 శాతం పనే జరిగింది. 25 శాతం కంటే పని తక్కువగా జరగడంతో కాంట్రాక్ట్ రద్దు చేయాలని గతేడాది సెప్టెంబరు 27న నీటిపారుదల శాఖాధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. పెద్దేరు కాలువలను ఆధునికీకరించి, మెరుగుపర్చే పనుల నిమిత్తం 2023 మార్చిలో రూ.84.40 కోట్లు మంజూరు చేశారు. శ్రీ సాయి లక్ష్మీ కనస్ట్రక్షన్స్‌నే రూ.71.59 కోట్ల విలువైన ఈ పనులను కూడా దక్కించుకుంది. 2.4 శాతం పని జరగకపోవడంతో కాంట్రాక్ట్ రద్దు చేయకుండా కొనసాగించాలని ప్రతిపాదనలు పంపారు. అయితే రెండు పనులకూ సంబంధించి పని రద్దు, పనులు కొనసాగింపు నిర్ణయం ప్రభుత్వ స్థాయిలో తీసుకోవాల్సివుంది. దీంతో అంతవరకు పనులు చేపట్టకుండా నిలిపివేశారు.

ప్రతిపాదనలకు దక్కని మోక్షం

జిల్లాలో భారీ నీటిపారుదల ప్రాజెక్టు తాండవ, మధ్య తరహా పెద్దేరు, రైవాడ, కోనాం జలాశయాలు, 2,880 చిన్న నీటి పారుదల వనరుల కింద 3.05 లక్షల ఎకరాల ఆయకట్టు వుంది. దీంట్లో తాండవ కింద 32,689 ఎకరాలు, పెద్దేరు, రైవాడ, కోనాం కింద 42,725 ఎకరాలు, చెరువులు, ఆనకట్టలు, గ్రోయిన్లు, చెక్‌డ్యామ్‌ల వంటి చిన్న నీటివనరుల కింద 2,30,579 ఎకరాలు సాగవుతోంది. పెద్దగా సాగునీటి వనరులు లేకపోవడంతో ఉన్నపాటి వనరులను అభివృద్ధి చేయడానికి చేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించడంలేదు. ఆయకట్టు స్థిరీకరణకు కావాల్సిన నిధులు, పెండింగ్ పనులు పూర్తిచేసేందుకు సరిపడా నిధులు విడుదల చేయడంలేదు. రైవాడ డ్యామ్ పునరుద్ధరణ, అభివృద్ధి ప్రాజెక్టు దశ - 2 పథకం కింద రూ.336 కోట్ల అంచనాలను రాష్ట్ర ప్రాజెక్టు మానిటరింగ్ విభాగం తయారుచేసి సిడబ్ల్యుసికి సమర్పించింది. ఈ పనుల ప్రాంత స్థలాన్ని సిడబ్ల్యుసి కన్సల్టెంట్ టీమ్ గతేడాది నవంబరు 27న పరిశీలించి సిడబ్యుసికి నివేదించింది. ఇంకా పనుల మంజూరు అనుమతులు సిడబ్ల్యుసి నుంచి రావాల్సివుంది.

మాడుగుల మండలం తాటిపర్తి వద్ద ఎన్‌టిఆర్ జలాశయ బ్యాలెన్స్ పనులకు రూ.21,75 కోట్లతో 2022 సెప్టెంబరు 1న అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయితే, నిర్మాణ పనుల వ్యయం పెరగడంతో ప్రభుత్వ సూచన ప్రకారం 2024-25 ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం ఇంకోసారి అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపాల్సివుంది. మాడుగుల మండలం శంకరం వద్ద ఉరకగెడ్డ జలాశయ పనులకు 2023 డిసెంబరు 21న రూ.14.50 కోట్లతో పంపిన ప్రతిపాదనలపై నిధులు విడుదల చేయకపోవడంతో పాత రేట్లను పునస్సమీక్షించి మరోసారి ప్రతిపాదనలు పంపాల్సివుంది.

ప్రశాంత ఎన్నికలకు..

ఎమ్మెల్సీ అభ్యర్థులు సహకరించాలి

రిటర్నింగ్ అధికారి ఎంఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అభ్యర్థులు పూర్తి సహాయ సహకారాలు అందించాలని రిటర్నింగ్ అధికారి ఎంఎన్.హరేంధిర ప్రసాద్ కోరారు. మంగళవారం మధ్యాహ్నం ప్రచార ప్రక్రియ గడువు ముగిసిన వెంటనే పోటీలో ఉన్న అభ్యర్థులు అనుసరించవలసిన విధానాలపై అభ్యర్థులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రవర్తనా నియమావళి, పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్ల నియామకంలో అనుమతుల విషయంలో అనుసరించాల్సిన విధానాలపై పలు సూచనలు చేశారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి వ్యవహరించాలని, ఎలాంటి సమన్వయ లోపమూ లేకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోలింగ్ ఏజెంట్లకు సంబంధించి గుర్తింపు కార్డులు పొందేందుకు ముందుగా దరఖాస్తు చేసుకుని గుర్తింపు కార్డులు పొందాలన్నారు. పోలింగ్ ఏజెంట్లు పోలింగ్ కేంద్రానికి ఉదయం 7 గంటలకల్లా చేరుకోవాలన్నారు. ఓటరు ఎపిక్ కార్డుగానీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలియజేసిన గుర్తింపు కార్డులనుగానీ ఓటు వేసే సమయంలో వెంట తెచ్చుకోవాలన్నారు. పోలింగ్ ఏజెంట్‌గానీ, ఓటరుగానీ పోలింగ్ బూత్‌లోకి మొబైల్స్, కెమెరాలను తీసుకురాకూడదన్నారు. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు సైలెంట్ పిరియడ్‌గా పరిగణించబడుతుందన్నారు. ఆ సమయంలో బల్క్ ఎస్ఎంఎస్‌ల ద్వారాగానీ, వాట్సాప్‌ల ద్వారాగానీ ప్రచారం చేయకూడదన్నారు. పోలింగ్ రోజును, కౌంటింగ్ రోజును డ్రై డేగా పాటించాలన్నారు. అభ్యర్థులు రెండు వాహనాలను మాత్రమే వినియోగించుకోవాలని, వాటికి సంబంధించి ముందస్తు పాసులు తీసుకోవాలని అన్నారు. పోలింగ్ బూత్‌నకు 200 మీటర్ల దూరంలో ఓటరు స్లిప్పులను అందజేయవచ్చున్నారు. షామియాలను వేయరాదన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి, ఎఆర్‌ఒ బిహెచ్.భవానీ శంకర్, ఈస్ట్ ఎసిపి లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి-రంపచోడవరం

స్థానిక గిరిజన గురుకుల పాఠశాలలో సోమవారం రాత్రి పదవ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ ఫేర్వెల్ పార్టీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్‌కె అహ్మద్ అలీషా మాట్లాడుతూ ప్రతి ఏటాలాగే ఈ ఏడాది కూడా మంచి ఉత్తీర్ణత సాధించి భవిష్యత్తులో మరింత ఉన్నస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల గురించి మాట్లాడుతూ తమ భవిష్యత్తుకు మార్గదర్శకులై తమకు బలమైన పునాది వేసిన గురువులను జీవితాంతం గుర్తుంచుకుంటామని, భవిష్యత్తులో మంచి స్థానాలకు చేరుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, గీతాలతో అందరినీ అలరించారు. అనంతరం ఉపాధ్యాయలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి విచ్చేసిన విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుండం శ్రీనివాస్ దొర, వైస్ ప్రిన్సిపాల్ మోపిదేవి, పాఠశాల విద్యా కమిటీ వైస్ చైర్మన్ వీరయ్య, టీచింగ్, నాన్ టీచింగ్, ఒకేషనల్, ఐటి సిబ్బంది, పిడి, పిఈటి, ఏఎన్ఎంలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గంగవరంలో డ్యాన్సులతో సందడి చేస్తున్న విద్యార్థులు

డిఎవి పాఠశాలలో...

మోతుగూడెం : చింతూరు మండలం, మోతుగూడెం గ్రామంలో ఉన్న డిఎవి పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు మల్లెల రఘురాం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా ఎపి జెన్కో చీఫ్ ఇంజినీర్ వాసుదేవరావు, ఎస్ఇ చిన్న కామేశ్వరరావు, డిఇ బాలకృష్ణ విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు బాగా రాసి మంచి ఉత్తీర్ణత సాధించి చదువు చెప్పిన ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘురాం మాట్లాడుతూ తొందరపాటు లేకుండా ప్రతి సబ్జెక్టును క్షుణ్ణంగా చదివి మంచి మార్కులు సాధించాలని, భవిష్యత్తులో మంచి చదువులు చదివి పాఠశాల ప్రతిష్టను, గౌరవాన్ని మరింత పెంచాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా తొమ్మిదో తరగతి విద్యార్థులు, పదో తరగతి విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు, పెన్నులు బహూకరించారు.

ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో...

గంగవరం : స్థానిక ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం వరలక్ష్మి వార్డెన్ మడకం లావణ్య ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థినుల వీడ్కోలు కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథులుగా ఎంఇఒ టి.మల్లేశ్వరరావు, స్థానిక సర్పంచ్ కలుముల అక్కమ్మ, మాజీ ఎంపిటీసీ కోసు బుల్లియమ్మ, పలువురు ప్రజా ప్రతినిధులు యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆటపాటలతో అలరించారు.

సక్రమంగా పని చేయని మొబైల్ నెట్‌వర్క్

- ఇబ్బందుల్లో వినియోగదారులు

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో మొబైట్ నెట్ వర్కు సక్రమంగా పని చేయడం లేదు. బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ నెట్వర్క్ వారం రోజుల నుంచి సక్రమంగా పనిచేయకపోవడంతో వినియోగదారులు అనేక ఇబ్బందులు గురవుతున్నారు. బిఎస్ఎన్ఎల్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తరచూ సాంకేతిక లోపాలు తలెత్తి సెల్ ఫోన్లు మూగబోతూ, నెట్వర్క్ సేవలు నిలిచిపోతూ అంతరాయం ఏర్పడుతుంది. జియో నెట్వర్క్ సేవలు కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో వినియోగదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బిఎస్ఎన్ఎల్, జియో సెల్ సేవలు, నెట్వర్క్ సేవలలో ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

ప్రజాశక్తి-ఎటపాక : వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మండలంలోని తోటపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... తోటపల్లికి చెందిన వేములపల్లి నాగభూషణంతో కొత్తగూడెంకు చెందిన సాయిప్రియకు ఆరెళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఐదేళ్ల బాలుడు ఉన్నాడు. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సాయిప్రియ (27) ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఉండడాన్ని భర్త గమనించి ఇరుగుపొరుగు వారికి తెలియజేశాడు. దీనిపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. సాయిప్రియ మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎటపాక ఎస్సై అప్పలరాజు తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి : మర్లపాటి నాగేశ్వరరావు

వేములపల్లి సాయి ప్రియ మృతిపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరావు డిమాండ్ చేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి మారేడుమిల్లి : తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మారేడుమిల్లి మండలంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహశీల్దారు మంగళవారం ఒక ప్రకటనలో బాలాజీ తెలిపారు. మారేడుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మెయిన్ బిల్డింగ్‌లో ఈ నెల 27న ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని చెప్పారు. మండలంలోని ఓటు హక్కు ఉన్న పట్టభద్రులందరూ పోలింగు కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని కోరారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో బిఎన్ఎస్ఎస్103 సెక్షన్ అమల్లో ఉందని, పోలింగ్ ముందు రోజు పోలింగ్ రోజు డ్రై డే అమల్లో ఉన్న కారణంగా ఎటువంటి మద్యం అమ్మకాలను జరపకూడదని స్పష్టం చేశారు. ఎవరైనా మద్యం అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పల్సస్ హెల్త్ టెక్ ఐటి ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రుషికొండ ఐటి సెజ్ హిల్ నెంబర్ 2లోగల పల్సస్ హెల్త్ టెక్ సంస్థలో పనిచేస్తున్న ఐటి ఉద్యోగులకు బకాయి పడ్డ నాలుగు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎంతో నైపుణ్యంగల స్టాఫ్‌వేర్ ఉద్యోగస్తులతో అతి తక్కువ జీతాలతో పనిచేయించుకుంటూ, ప్రతి నెలా జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. కాన్ఫరెన్స్, జనరల్ క్యాటగిరీ ఉద్యోగస్తుల నుంచి ప్రతి నెలా జీతం నుండి 10 నుండి 15 శాతం అన్యాయంగా కోత విధిస్తున్నారన్నారు. పల్సస్ యాజమాన్యం జాబ్ మేళా, క్యాంపస్ సెలక్షన్స్ పేరుతో ఐటి విద్యార్థులను ఎంపిక చేసి వారికి జీతాలు ఇవ్వకుండా మోసం చేయడం తగదన్నారు. అలాగే వారికి పిఎఫ్ కింద యాజమాన్యం వాటా చెల్లించటం లేదన్నారు. ప్రభుత్వం వద్ద నుండి అనేక రాయితీలు పొందుతున్న పల్సస్ యాజమాన్యం కార్మికులకు జీతాలు చెల్లించకుండా వారితో వెట్టిచాకిరీ చేయించుకోవడం దుర్మార్గమన్నారు.

ఆర్‌బిఐ మాజీ గవర్నర్‌కు ఆత్మీయ స్వాగతం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారత రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావుకు విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆత్మీయ స్వాగతం పలికారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాల క్యాంపస్‌లో డాక్టర్ వైవిఎస్.మూర్తి ఆడిటోరియంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం నగరానికి వచ్చిన సుబ్బారావును మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ ఆహ్వానించారు. ఈ క్రమంలో ఆయన కలెక్టర్‌తో వివిధ అంశాలపై మాట్లాడారు.